ప్రజాపక్షం
Telugu National Daily
మహబూబ్‌నగర్
మంగళవారం
23-06-2026
www.prajapaksham.in
మహబూబ్‌నగర్, నారాయణపేట, వనపర్తి, నాగర్‌కర్నూల్, జోగులాంబ గద్వాల
స్థానికం LOCAL NEWS



## యువకులు లక్ష్యాన్ని పెట్టుకొని విజయం దిశగా ఎదగాలి

### ధన్వాడ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ వైశాలి

**ప్రజాపక్షం/ధన్వాడ :** అగ్నివీర్‌కు ఎంపికైన ధన్వాడ పట్టణానికి చెందిన యువకులు ఇంకా జీవితంలో ఉన్నతంగా ఉన్న లక్ష్యాలను రాణించాలని ధన్వాడ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ వైశాలి కోరారు. తమ పాఠశాలలో చదివి అగ్నివీర్‌కు ఎంపికైన యువకులను సోమవారం ధన్వాడ మోడల్ స్కూల్‌లో ఉపాధ్యాయులు వారి బృందంతో కలిసి యువకులను సోమవారం ధన్వాడ మోడల్ స్కూల్‌లో ఉపాధ్యాయులు వారి బృందంతో కలిసి యువకులకు శాలువా, పూలమాలతో ఘనంగా సత్కరించారు. నవీన్ శివ కుమార్, లక్ష్మణ్ అనే యువకులు అగ్ని వీర్‌కు ఎంపిక కావడం పట్ల వారిని అభినందించి సన్మానించారు. భవిష్యత్తులో రాణించి గ్రామానికి తల్లిదండ్రులకు పేరు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎస్‌ఐఆర్‌పై జిల్లా స్థాయి అవగాహన సదస్సు

### సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌ఎండి ఫయాజ్

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** నాగర్‌కర్నూల్ భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ నాగర్‌కర్నూల్ జిల్లా సమితి ఆధ్వర్యంలో సర్‌ఎస్‌ఐఆర్‌పై జిల్లా స్థాయి అవగాహన సదస్సు స్థానిక డికెఆర్ ఎసి ఫంక్షన్ హాల్‌లో మంగళవారం ప్రారంభం అవుతుందని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌ఎండి ఫయాజ్ తెలిపారు. ఈ సదస్సులో పార్టీ శ్రేణులకు గ్రామస్థాయి ముఖ్య నాయకులకు అవగాహన కల్పిస్తామన్నారు. ఈ సదస్సుకు సిపిఐతో పాటు కాంగ్రెస్, సిపిఐ(ఎం) నాయకులు, కార్యకర్తలు హాజరవుతారని ఆయన తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ సి.వంశీకృష్ణ, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం.బాలనరసింహ, గౌరవ అతిథిగా సిపిఎం జిల్లా కార్యదర్శ వర్గం పర్వతాలు, తదితరులు హాజరవుతారన్నారు. ఈ అవగాహన సదస్సుకు మూడు పార్టీల కార్యకర్తలు, నాయకులు అధికసంఖ్యలో హాజరు కావాలని ఫయాజ్ పిలుపునిచ్చారు.

## అక్షరం అభివృద్ధికి మూలం

### డిప్యూటీ సర్పంచ్ చిన్న కురుమయ్య

**ప్రజాపక్షం/పెద్దకొత్తపల్లి :** నేటి సమాజంలో అక్షరం అభివృద్ధికి మూలం, అది అందరికి అందించడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం నేతృత్వంలో సిఎం రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారని కల్వకోల్ గ్రామ డిప్యూటీ సర్పంచ్ చిన్న కురుమయ్య అన్నారు. కల్వకోల్ ఎడ్యుకేషన్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో సోమవారం ప్రభుత్వ పాఠశాలలో 25 మంది నూతన విద్యార్థినీ విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో 25 మంది నూతన విద్యార్థిని, విద్యార్థులను చేర్పించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సర్పంచచ్ మాట్లాడుతూ దేశం గాని, రాష్ట్రంగాని, అభివృద్ధి చెందాలంటే విద్యతోనే సాధ్యమవుతుందని ప్రభుత్వ విద్యకు కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేసిందన్నారు. ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్యతోపాటు విశాలమైన తరగతులు, గదులు, ఉంటాయని మన పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించి, ప్రభుత్వ బడులను కాపాడుకుందాం అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మదన గోపాల్, డిప్యూటీ మాజీ సర్పంచ్ సంగం వెంకటస్వామి, కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు, మదనగోపాల్, బిచ్చన్న గౌడ్, శివ గౌడ్, కల్వకోల్ ఎడ్యుకేషన్ డెవలప్‌మెంట్ సొసైటీ సభ్యులు ధర్మారెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## గట్టులో పేదరిక నిర్మూలనకు సమగ్ర కార్యాచరణ

### కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

**ప్రజాపక్షం/గద్వాల రూరల్ :** జిల్లాలో టిజిఐ ఎల్పీకి ఎంపికైన గట్టు మండలంలో పేదరిక నిర్మూలనకు సమగ్ర మండలంలో పేదరిక నిర్మూలనకు సమగ్ర కార్యాచరణతో ముందుకెళ్తున్నట్లు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ తెలిపారు. తెలంగాణ ఇంక్లూజివ్ లైవ్‌లిహుడ్ ప్రోగ్రామ్ (టిజిఐఎల్పీ) గురించి సోమవారం హైదరాబాద్ నుంచి సెర్ప్ సిఇఒ దివ్య దేవరాజన్ ప్రోగ్రాంకు ఎంపికైన వివిధ జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో అత్యంత పేద కుటుంబాలను శాశ్వతంగా పేదరికం నుంచి బయటకు తీసుకురావడమే తెలంగాణ ఇంక్లూజివ్ లైవ్‌లిహుడ్ ప్రోగ్రామ్ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఆయా కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నింటిని పూర్తి స్థాయిలో అందుబాటులోకి తేవడం, జీవనోపాధి కోసం నిరంతర మార్గదర్శ కత్వం చేయడం ద్వారా పేదరికం నుంచి బయటపడేలా చేయనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో అమలులో మహిళా స్వయం సహాయక సంఘాలు కీలక పాత్ర పోషించనున్నామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు, డిపిఒ శ్రీకాంత్, డిఆర్డీఓ ముషాహిదా బేగం, ఎపిడి శ్రీనివాస్ పాల్గొన్నారు.

## నిరుద్యోగుల ఆక్రోశమే 'కాక్రోచ్' రూపంలో ఆవిష్కృతం

### ఎఐవైఎస్ మాజీ రాష్ట్ర సహాయ కార్యదర్శి సురేష్

**ప్రజాపక్షం/అమరచింత :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిరుద్యోగల పట్ల అనుసరిస్తున్న మోసకారి, దగాకోరు విధ్వంసకర తీవ్రమైన ఆర్థిక విధానాల వ్యతిరేకతే కాక్రోచ్ రూపంలో దేశంలో ఆవిష్కృతం అయ్యిందని ఎఐవైఎఫ్ మాజీ రాష్ట్ర సహాయ కార్యదర్శి పి.సురేష్ ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం అమరచింత మండల కేంద్రంలోని సిపిఐ కార్యాలయంలో అఖిల భారత యువజన సమాఖ్య (ఎఐవైఎఫ్) అమరచింత మండల నిర్మాణ మహాసభ జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన పి.సురేష్ మాట్లాడుతూ దేశంలో నిరుద్యోగ యువతీ యువకుల భవిష్యత్తు అంధకారంలోకి నెట్టి వేయబడిందని అన్నారు. అణుశక్తి కంటే యువశక్తి బలమైందని, కానీ పాలకుల ద్వంద రాజకీయ పాలనీకరణతో నిర్వీర్యం అయ్యిందని ఆందోళన చెందారు. మోదీ సర్కార్ ఏటా రెండు కోట్ల ఉద్యోగాల హామీ ఏమైందని ఆయన ప్రశ్నించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిత్యం మాయమాటలతో నమ్మించి విద్యార్థి, యువతను విస్మరిస్తున్నారని ప్రభుత్వాలపై ధ్వజమెత్తారు. ఎఐవైఎఫ్ అమరచింత మండల కమిటీ ఎన్నిక అఖిల భారత యువజన సమాఖ్య (ఎఐవైఎఫ్) అమరచింత మండల నూతన అధ్యక్షుడుగా పి.శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శిగా ఎం.డి.మహమూద్, ఉపాధ్యక్షుడుగా శేఖర్, సహాయ కార్యదర్శిగా రవి, కోశాధికారిగా ఉదయ్ కిరణ్‌తో పాటు మరో ఆరు మందిని సమితి సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కుతుబ్, సిపిఐ మండల కార్యదర్శి ఎ.అబ్రహం, సిపిఐ అమరచింత పట్టణ కార్యదర్శి రవీందర్, ఎఐవైఎఫ్, సిపిఐ నాయకులు రామ్‌రెడ్డి, రాజు, శివ కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# మహిళల ఆర్థిక సాధికారితే ప్రభుత్వ లక్ష్యం

### దుందుభి వాగుపై రూ.20 కోట్లతో హై లెవెల్ బ్రిడ్జికి శంకుస్థాపన
### ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి పట్టుదలతోనే చిరకాల స్వప్నం సాకారం
### మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క



**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** నాగర్‌కర్నూల్ అభివృద్ధికి మరిన్ని నిధులు అందిస్తామని, మహిళల ఆర్థిక సాధికారతే ప్రభుత్వ లక్ష్యమని, ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డా.దనసరి అనసూయ సీతక్క అన్నారు. ఆదివారం నాగర్‌కర్నూల్ నియోజకవర్గ పరిధిలోని తాడూరు మండలం, సిర్సవాడ గ్రామం వద్ద దుందుభి వాగుపై రూ.20కోట్ల వ్యయంతో నిర్మించనున్న హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణం పనులకు నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యుడు డా.మల్లురవి, ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్ రెడ్డి, నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే డా.కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి, అచ్చంపేట ఎమ్మెల్యే డా.వంశీకృష్ణ, జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డితో కలిసి మంత్రి సీతక్క సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ ప్రాంత ప్రజల దశాబ్దాల నాటి కలను సాకారం చేయడంలో నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే డా.కూచుకుళ్ల రాజేష్ రెడ్డి అసాధారణమైన పట్టుదలతో కృషి చేశారని మంత్రి సీతక్క ప్రశంసించారు. ఈ వంతెన నిర్మాణం కేవలం ఒక అభివృద్ధి కార్యక్రమం మాత్రమే కాదని, వేలాది మంది ప్రజల జీవితాలను సులభతరం చేసే చారిత్రాత్మక నిర్ణయమని ఆమె అన్నారు.

**ప్రజల చిరకాలిక కోరిక నెరవేరింది ఎంపి డా.మల్లు రవి :** నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యుడు డా.మల్లురవి మాట్లాడుతూ ఈ ప్రాంత ప్రజల చిరకాలిక కోరిక నెరవేరిన సందర్భంగా మంత్రి డా.ధనసరి అనసూయ సీతక్కకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. దుందుభి వాగుపై హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన జరగడం ఈ ప్రాంత ప్రజలకు చారిత్రాత్మక ఘట్టమని తెలిపారు. 2008లో తాను జడ్చర్ల నియోజకవర్గ ఎమ్మెల్యేగా పనిచేసిన సమయంలో సిర్సవాడ గ్రామం జడ్చర్ల నియోజకవర్గ పరిధిలో ఉండేదని గుర్తుచేశారు.

కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలో ప్రజా ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే దిశగా పనిచేస్తోందని అన్నారు. ఈ వంతెన నిర్మాణంతో స్థానిక ప్రజల ఎన్నో ఏళ్ల ఆశ నెరవేరనుందని తెలిపారు. అచ్చంపేట ఎమ్మెల్యే డా.వంశీకృష్ణ మాట్లాడుతూ మంత్రి సీతక్క అందరికీ అక్కలాంటివారని, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి కోసం ఆమె ప్రత్యేక శ్రద్ధతో పనిచేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అమరేందర్, దేవసహాయం, వివిధ శాఖల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ ఇసుకను అడ్డుకుని బాధ్యులపైన చర్య తీసుకోవాలి

### మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి కలెక్టర్‌కు ఫిర్యాదు



**ప్రజాపక్షం/మక్తల్ :** కృష్ణా మాగనూరు మండలాల్లో అక్రమంగా నిర్వహిస్తున్న ఇసుక మాఫియాలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సోమవారం నారాయణపేట జిల్లా కలెక్టర్‌ను వారి కార్యాలయంలో కలిసి మాజీ శాసనసభ్యుడు చిట్టెం రామ్మోహన్ రెడ్డి ఫిర్యాదు చేశారు. గత కొంతకాలంగా ఎలాంటి అనుమతులు లేకుండా విచ్చలవిడిగా రాత్రి, పగలు ఇసుక మాఫియా తమ ఇష్టారాజ్యంగా తరలించుకోవడం జరుగుతుందని తెలిపారు. కలెక్టర్ కార్యాలయంలో ఇచ్చిన అనుమతులకు విరుద్ధంగా ఎక్కువ శాతం ఇసుకను తరలించకపోవడం జరుగుతుందని చెప్పారు. ఏవిధంగా యంత్రాలతో ఇసుకను టిప్పర్లలో నింపి పంపించడం జరుగుతుందని వాస్తవంగా లేబర్‌ను పెట్టి వారికి ఉపాధి కల్పించాలని ఆయన డిమాండు చేశారు. వర్షకాలంలో సక్రమంగా వర్షాలు లేక కూలీలకు పని లేక ఇబ్బందులు పడుతున్నారని ఇలాంటి రీచ్‌ల దగ్గర కూలీలకు ఉపాధి కల్పించడం వలన వారికి న్యాయం చేసినట్లు అవుతుందని ఆయన తెలిపారు. అదే విధంగా కృష్ణ మండలంలోని బిఆర్‌ఎస్ పార్టీ నాయకుడు శివ రాజు పాటేల్‌ని కొందరు దుండగులు ఫోన్ చేసి బెదిరించడం జరిగిందని, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఆదేశించాలని కలెక్టర్‌ను కోరారు. దీనికి కలెక్టర్ స్పందిస్తూ అక్రమ ఇసుకని అడ్డుకోవడంతో పాటు బిఆర్‌ఎస్ పార్టీకి సంబంధించిన వ్యక్తులకు ఫోన్ చేసి బెదిరించిన వ్యక్తులపై ఖచ్చితంగా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని వారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పి.నరసింహ గౌడ్, సింగిల్ విండో అధ్యక్షుడు కొత్తపల్లి వెంకట్‌రెడ్డి, మాగనూరు మండల పార్టీ మాజీ అధ్యక్షులు కె.ఎల్లారెడ్డి, శివరాజు పటేల్, శివప్ప, బాలప్ప, చిన్న బసప్ప గౌడ్, అశోక్ గౌడ్, అమ్రేష్, తిమ్మన్న, శంకరప్ప, భీమేష్ తదితరులు పాల్గొన్నారు.

## జడ్చర్ల మండల ఉపసర్పంచుల ఫోరం కమిటీ ఏకగ్రీవంగా ఎన్నిక



**ప్రజాపక్షం/జడ్చర్ల :** రాష్ట్ర ఉపసర్పంచ్‌ల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు బొట్ల కార్తీక్ ఆదేశాల మేరకు, మహబూబ్ నగర్ జిల్లా ఉప సర్పంచుల ఫోరం జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్ కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో సోమవారం జడ్చర్ల మండల ఉపసర్పంచ్‌ల ఫోరం సమావేశం నిర్వహించి, నూతన మండల కమిటీని ఏకగ్రీవంగా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జడ్చర్ల మండల ఉపసర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడిగా పోలేపల్లి గ్రామ ఉపసర్పంచ్ గంధం పురుషోత్తం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అలాగే కమిటీలోని ఇతర పదవులకు కింది సభ్యులను ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడుగా గంధం పురుషోత్తం (పోలేపల్లి గ్రామ ఉపసర్పంచ్), వర్కింగ్ ప్రెసిడెంట్ బాలస్వామి చిన్నాధిరల ఉప సర్పంచ్, ఉపాధ్యక్షుడు రాజు మర్రిచెట్టు తండా ఉప సర్పంచ్, బాలరెడ్డి పెద్దపల్లి ఉప సర్పంచ్, ప్రధాన కార్యదర్శి సతీష్ (కొండేడు గ్రామ ఉపసర్పంచ్) ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన జడ్చర్ల మండల ఉపసర్పంచుల ఫోరం అధ్యక్షుడు గంధం పురుషోత్తం మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి ఏకగ్రీవంగా అధ్యక్షుడిగా ఎన్నుకున్న మండలంలోని అన్ని గ్రామాల ఉప సర్పంచ్‌లకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

అలాగే ఉపసర్పంచ్‌ల హక్కుల పరిరక్షణ, సమస్యల పరిష్కారం, గ్రామాభివృద్ధి కోసం మండలంలోని అన్ని ఉపసర్పంచ్‌లను సమన్వయం చేసుకుంటూ పనిచేస్తానని తెలిపారు. రాష్ట్ర, జిల్లా నాయకత్వం సూచనల మేరకు జడ్చర్ల మండల ఉపసర్పంచ్‌ల ఐక్యతను మరింత బలోపేతం చేస్తామని పేర్కొన్నారు.

## పెద్ద నట్టు భూమిపై వచ్చిన జీవో 99 వెంటనే రద్దు చేయాలి

### కొప్పునూరు గ్రామ రైతు కమిటీ సభ్యులు

**ప్రజాపక్షం/చిన్నంబావి :** చిన్నంబావి మండల పరిధిలోని కొప్పునూరు గ్రామానికి చెందిన గ్రామ రైతు కమిటీ, గ్రామ ప్రజలు కొల్లాపూర్ ఆర్డీఓకు, నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్‌కు కొప్పునూరు గ్రామ ప్రజలు వినతిపత్రం అందజేశారు. కొప్పునూరు గ్రామ ప్రజల పేరు మీద పట్టా అయి ఉన్న 116 ఎకరాల పెద్దనట్టు భూమిని కొప్పునూరు గ్రామ ప్రజలకు చెందే విధంగా అమలు చేయాలని గ్రామ ప్రజలు కోరారు. జీ.వో 99 రద్దు చేయాలని మంత్రి జూపల్లి కృష్ణారావును కొప్పునూరు ప్రజలు కోరుతున్నారు. లేనిపక్షంలో కొప్పునూరు గ్రామ ప్రజలందరితో మహాధర్నాకు సిద్ధమవుతామని జీ.వో 99ని రద్దు చేసేవరకు పోరాటం కొనసాగిస్తామని గ్రామ ప్రజలు తెలిపారు. కొప్పునూరు గ్రామ ప్రజలకు ఎలాంటి సమాచారం లేకుండా ప్రజల అభిప్రాయం లేకుండా జీవో 99ను తీసుకు రావడం ఏంటని గ్రామ ప్ర.లు ఆవేదన వ్యక్తం చేశారు. పెద్దన్నట్టు భూమి 116 ఎకరాలు కొప్పునూరు గ్రామ ప్రజల ఉమ్మడి ఆస్తి అని ఈ భూమి కొరకు ఎంతవరకైనా పోరాడుతామని గ్రామ ప్రజలు ముక్తకంఠంగా ఖండిస్తున్నామన్నారు.



## ప్రారంభానికి ముందే పగుళ్లు, ధ్వంసమైన కిటికీలు

### ఆసుపత్రి నిర్మాణంలో కాంట్రాక్టర్ నిర్లక్ష్యం



**ప్రజాపక్షం/గద్వాల :** కాంట్రాక్టర్ నిర్లక్ష్యం, అధికారుల పర్యవేక్షణా లోపం కారణంగా జోగులాంబ గద్వాల్ జిల్లా అయిజ పట్టణంలో నూతనంగా నిర్మించిన 30 పడకల ప్రభుత్వ ఆసుపత్రి భవనం ప్రారంభానికి ముందే వివాదాల్లో చిక్కుకుంది. ఇంకా భవనం అందుబాటులోకి రాకముందే గోడలు, పిల్లర్లకు భారీగా పగుళ్లు రావడం స్థానికంగా తీవ్ర కలకలం రేపుతోంది. కోట్ల రూపాయల ప్రభుత్వ నిధులతో నిర్మించిన ఈ భవనం నాణ్యతా ప్రమాణాలకు తిలోదకాలు ఇచ్చి కట్టినట్లు స్పష్టమవుతోంది.

**నాసిరకం మెటీరియల్... కాంట్రాక్టర్ నిర్లక్ష్యం**

ప్రాంతీయ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ 30 పడకల ఆసుపత్రి నిర్మాణాన్ని చేపట్టింది. అయితే, నిర్మాణ బాధ్యతలు చేపట్టిన కాంట్రాక్టర్ తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరించారని స్థానికులు ఆరోపిస్తున్నారు. భవన నిర్మాణంలో అత్యంత నాసిరకం ఇసుక, తక్కువ నాణ్యత గల సిమెంట్ ఉపయోగించినట్లు తెలుస్తోంది. పునాదులు, నిర్మాణంలో సరైన ప్రమాణాలు పాటించకపోవడం వల్లే భవనం అంతటా పగుళ్లు దారితీశాయని నిపుణులు భావిస్తున్నారు. దీనికి తోడు భవనానికి అమర్చిన కిటికీలు, వాటి అద్దాలు ఇప్పటికే ధ్వంసమై ఊడిపోతున్నాయి. సరైన నాణ్యత లేని ఫిట్టింగ్స్ వాడటం వల్లే ఇవి విరిగిపోయినట్లు తెలుస్తోంది.

**ప్రజల ఆగ్రహం... ఉన్నతాధికారుల విచారణకు డిమాండ్**

రూ. కోట్ల ప్రజాధనం ఈవిధంగా దుర్వినియోగం కావడంపై అయిజ ప్రాంత ప్రజలు, ప్రజాసంఘాల నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆసుపత్రిని ప్రారంభించక ముందే భవనం ఇంతలా దెబ్బతింటే, రేపు వందలాది మంది రోగులు వచ్చినప్పుడు పరిస్థితి ఏమిటని ప్రశ్నిస్తున్నారు. వైద్య సేవలు అందాల్సిన వేళ, ఆసుపత్రి భవనమే ప్రమాదకరంగా మారడంపై ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్, వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు స్పందించి తక్షణ చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

## సిఎం సహాయనిధి నిరుపేదలకు వరం

**ప్రజాపక్షం/పెద్దకొత్తపల్లి :** సిఎం సహాయ నిధి నిరుపేదలకు వరం లాంటిదని కల్వకోల్ గ్రామ డిప్యూటీ సర్పంచి గువ్వలి చిన్న కురుమయ్య అన్నారు. టూరిజం, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు సహకారంతో మంజూరైన సిఎం సహాయనిధి చెక్కును సోమవారం జూపల్లి కృష్ణారావు ఆదేశాలతో డిప్యూటీ సర్పంచి తో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు మార్క్, వెంకటస్వామికి సిఎం సహాయనిధి చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు రమేష్, మాజీ వైస్ ఎంపిపి గువ్వలి రాముడు, మాజీ ఉపసర్పంచు సంగం వెంకటస్వామి, మాజీ వార్డు సభ్యులు మదన గోపాల్, బిచ్చన్నగౌడ్, కాంగ్రెస్ పార్టీ యువకులు శివగౌడ్, నూనె క్రాంతి కుమార్, సాయి యాదవ్, వెంకటస్వామి, తదితరులు పాల్గొన్నారు.





## వానాకాలంలో ప్రబలే వ్యాధుల నియంత్రణకు తగిన చర్యలు

### కలెక్టర్ సిహెచ్.ప్రియాంక

**ప్రజాపక్షం/నారాయణపేట :** వర్షాకాలంలో ప్రబలే సీజనల్ వ్యాధుల నియంత్రణకు తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ సిహెచ్.ప్రియాంక ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లోని విసి హాల్‌లో కలెక్టర్ ప్రియాంక అధ్యక్షతన వర్షాకాలంలో ప్రబలే సీజనల్ వ్యాధులు మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా, వైరల్ ఫీవర్, వాంతులు, విరోచనాలు, టైఫాయిడ్ మొదలగు వ్యాధుల నియంత్రణ చర్యలపై జిల్లా స్థాయి సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశంలో వివిధ అంశాలపై అన్ని శాఖల అధికారులతో చర్చించారు. సమావేశంలో ముందుగా జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డా.కే.జయచంద్ర మోహన్ కార్యక్రమం ఉద్దేశ్యాన్ని జిల్లా అధికారులకు తెలపగా, ప్రోగ్రాం అధికారి డా.లక్ష్మీ కాంత్ ఈ కార్యక్రమం మొత్తం వివరాలను పిపిటి ద్వారా అన్ని శాఖల అధికారులకు వివరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులు సమన్వయంతో నిరంతరంగా డ్రైడే ఆక్టివిటీస్ నిర్వహించాలని సూచించారు. ఈ సమన్వయ కమిటీ సమావేశంలో డిఆర్డీఎ/డిపిఒ వెంకట్‌రాములు, డిడబ్ల్యుఒ రాజేందర్ గౌడ్, మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ సంపత్ కుమార్, మిషన్ భగీరథ ఇఇ రంగారావు, జిల్లా మత్స్య శాఖ అధికారి రెహమాన్, బిసి సంక్షేమ శాఖ అధికారి అబ్దుల్ ఖలీల్, మున్సిపల్ కమిషనర్లు శంకర్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల విధులపై పారదర్శకత ఏది?

### కలాల్ రామన్ గౌడ్ ధ్వజం

**ప్రజాపక్షం/మక్తల్ :** మక్తల్ మండలం, పంచదేవ్ పహాడ్ గ్రామ పరిధిలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు కేటాయించిన ప్రభుత్వ నిధుల వినియోగంలో పారదర్శకత కరువైందని, తక్షణమే ఉన్నతాధికారులు స్పందించి సమగ్ర విచారణ జరపాలని జ్యోతి రావు పూలే బిసి సంఘం మక్తల్ మండల అధ్యక్షుడు కలాల్ రామన్‌గౌడ్ డిమాండు చేశారు. పంచదేవ్ పాడు పాఠశాలలో గత రెండు ఆర్థిక సంవత్సరాలుగా (2022–2023,2023–24) వివిధ ప్రభుత్వ పథకాల కింద విడుదలైన నిధుల వివరాలను బహిర్గతం చేయాలని కోరుతూ మక్తల్ మండల విద్యాధికారి ఎంఇఒ కార్యాలయంలో సమాచార హక్కు చట్టం 2005, సెక్షన్ 6(1) ప్రకారం సోమవారం దరఖాస్తు స్వీకరించారు.

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వాలు పాఠశాలల బలోపేతానికి, మౌలిక వసతుల కల్పనకు లక్షలాది రూపాయల నిధులు విడుదల చేస్తున్నాయి. పాఠశాలలకు సంబంధించిన క్యాష్ బుక్ పేజీలు, బ్యాంక్ పాస్‌బుక్ స్టేట్‌మెంట్లు, బిల్లులు, వోచర్లు ధృవీకరించిన నకళ్లను చట్టప్రకారం 30 రోజుల్లోగా అందించాలని, లేనిపక్షంలో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో పాటు పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జ్యోతిరావు పూలే బిసి సంఘం కోశాధికారి రాజు సాగర్, ఊట్కూర్ మండలం అధ్యక్షుడు ఉప్పరి నరసింహులు, ఇతర ముఖ్య నాయకులు, సామాజిక కార్యకర్తలు పాల్గొన్నారు.



## ప్రభుత్వ ఉపాధ్యాయుడి కుమారుడు ప్రభుత్వ బడిలో చేరిక

### తూముకుంట జడ్పీహెచ్‌ఎస్‌లో అడ్మిషన్
### గ్రామంలో ఆదర్శంగా నిలిచిన ఉపాధ్యాయుడు

**ప్రజాపక్షం/వీపనగండ్ల :** ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతోందనే విషయాన్ని ఆచరణలో చూపిస్తూ వీపనగండ్ల మండలం తూముకుంట గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు బాలీశ్వరమ్మ తన కుమారుడు శరత్‌ను స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల తూముకుంటలో ఎనిమిదో తరగతిలో చేర్పించి ప్రభుత్వ విద్యపై ప్రజల్లో విశ్వాసాన్ని పెంపొందించేవిధంగా ఆదర్శంగా నిలిచారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య, నైపుణ్యాభివృద్ధి అవకాశాలు, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయుల బోధన అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వ ఉపాధ్యాయుడే తన కుమారుడిని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించడం, ప్రభుత్వ విద్యా వ్యవస్థపై ఉన్న నమ్మకాన్ని నిదర్శనమని పేర్కొన్నారు. తల్లిదండ్రులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుని తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి సమాజంలోని ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు మోహన్, హుస్సేన్, నాగరాజు, వెంకట్‌స్వామి, రజనీ, సీఆర్పి నాగరాజు, తదితరులు పాల్గొని బాలీశ్వరయ్య దంపతులను అభినందించారు.



## నివేదిత స్కూల్ అక్రమాలపై డిఇఒకు ఫిర్యాదు : టిజివిపి జిల్లా అధ్యక్షుడు రవి

**ప్రజాపక్షం/వనపర్తి టౌన్ :** వనపర్తి జిల్లాలోని నివేదిత ప్రైవేట్ పాఠశాలలో జరుగుతున్న విద్యా చట్టాల ఉల్లంఘనలు, అక్రమాలపై జిల్లా విద్యాశాఖాధికారి డిఇఓ తక్షణమే సమగ్ర విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ విద్యార్థిపరిషత్ టిజివిపి వనపర్తి జిల్లా అధ్యక్షుడు రవి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన నివేదిత స్కూల్ అక్రమాలపై జిల్లా విద్యాశాఖాధికారికి రాతపూర్వకంగా ఫిర్యాదును సమర్పించారు. ఈ సందర్భంగా రవి విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలోని నివేదిత స్కూల్ విద్యాశాఖ నిబంధనలను పూర్తిగా తుంగలో తొక్కి, విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకుంటూ, తల్లిదండ్రులను నిలువునా దోపిడీ చేస్తోందని మండిపడ్డారు. విద్యా వ్యవస్థను భ్రష్టుపట్టిస్తున్న నివేదిత స్కూల్ గుర్తింపును తక్షణమే రద్దు చేయాలని, అక్రమాలకు పాల్పడుతున్న యాజమాన్యంపై, వారికి సహకరిస్తున్న అధికారులపై ఉన్నతస్థాయి కమిటీతో విచారణ జరిపించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో తెలంగాణ విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతామని రవి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బాలు, సురేష్, విష్ణు, మహేష్, విజయ్, టిజివిపి ముఖ్య నాయకులు, విద్యార్థి సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

